సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 5 । అక్టోబర్ । 2025

మార్కండేయ మందిరం వద్ద దేవీ మాత శోభాయాత్ర, మహిళల కోలాటాలు, ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాలు



గరిష్టం/కనిష్టం
35.2 /22.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చల్లనిగాలులు వీస్తాయి. అక్కడక్కడ తేలిక పాటి జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

రూ.92 వేలు పలికిన గుమ్మడికాయ



మాక్లూర్: మండలంలోని ముల్లంగి (బి) గ్రామంలో దుర్గామాత వద్ద ఉంచిన గుమ్మడి కాయను శనివారం నిర్వాహకులు వేలం వేశా రు. అదే గ్రామానికి చెందిన బూరోల్ల ధర్మపతి వేలంలో గుమ్మడికాయను రూ.92 వేలకు దక్కించుకున్నాడు. దుర్గామాత మండప నిర్వాహకులు భక్తుల సమక్షంలో గుమ్మడికాయను ధర్మపతికి అందజేశారు.

ధాన్యం దళారులకు అమ్మి నష్టపోవద్దు



వర్ని : రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ సూచించారు. శనివారం వర్ని మండలంలోని పాత వర్ని సహకార సంఘంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడం వల్ల గిట్టుబాటు ధర ఏ గ్రేడ్ రకానికి రూ. 2,389, బి గ్రేడ్ రకానికి రూ.2,369 చెల్లించడంతోపాటు సన్న రకాలకు రూ. 500 బోనస్ కూడా వస్తుందని సహకార అధికారి పేర్కొన్నారు. దళారులు రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. తహసీల్దార్ సాయిలు, సొసైటీ చైర్మన్ సాయిబాబా పాల్గొన్నారు.

సమన్వయంతో పరిష్కరించాలి



వర్ని: మండలంలోని సిద్ధాపూర్ రిజర్వాయర్ వద్ద వివాదాస్పదంలో ఉన్న భూమిని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో శనివారం పరిశీలించారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య వివాదంలో ఉన్న స్థలాన్ని పరిశీలించి, సమన్వయంతో రెండుశాఖల అధికారులు సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యను 15 రోజుల్లో పరిష్కరించాలని లేకపోతే రిజర్వాయర్ పనులు ఆలస్యం అయ్యే ప్రమాదముందన్నారు.

వరద గేట్ల ముందు జాలరి గల్లంతు



ప్రాణాలతో బయటపడిన ఆనంద్



గల్లంతైన అనిల్ (ఫైల్)

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరద గేట్ల ముందర గోదావరిలో చేపలు వేటాడుతున్న మత్స్యకారుడు శనివారం గల్లంతయ్యాడు. మెండోరా ఎస్సై సుహాసిని, స్థానిక మత్స్యకారులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం కాల్వా గ్రామానికి చెందిన లింబోజి అనిల్ (25), లింబోజి ఆనంద్ అన్నదమ్ములు ఇద్దరు మధ్యాహ్నం నుంచి గోదావరిలో వరద గేట్ల ముందర చేపలు వేటాడుతున్నారు. ఈ క్రమంలో వరద గేట్ల ముందర ప్రవాహానికి ఎదురెళ్లడంతో తెప్ప తలకిందులు అయ్యింది. అనిల్ నీటి ప్రవాహంలో కొట్టుకు పోయాడు. ఆనంద్ ప్రవాహం పక్కన ఉన్న బండరాయిని పట్టుకుని బతికి పోయాడు. ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఒక తెప్ప పై ఇద్దరు వేటకు వెళ్లాల్సి ఉంటుందని మత్స్యకారులు తెలిపారు. గోదావరిలోనే చేపలు వేటాడుతున్న మత్స్యకారులు గమనించి వెంటనే ప్రాజెక్ట్ అధికారులకు సమాచారం అందించారు. ప్రాజెక్ట్ అధికారులు వెంటనే వరద గేట్లను మూసివేశారు. అనంతరం స్థానిక మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడే వరకు ఆచూకీ లభించలేదు. దీంతో గాలింపు చర్యలను నిలిపి వేశారు. అనంతరం మళ్లీ రాత్రి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు ప్రారంభించారు.







దేవీ మాతకు ఘనంగా వీడ్కోలు

నిజామాబాద్ రూరల్: నవరాత్రుల్లో విశేష పూజలు అందుకున్న దుర్గా మాత విగ్రహాల శోభాయాత్ర, నిమజ్జనోత్సవాలు నగరంలో ఘనంగా జరిగాయి. శనివారం మధ్యాహ్నం ప్రారంభమైన ఉత్సవాలు రాత్రి వరకు కొనసాగాయి. ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలు మంగళహారతులతో అమ్మవారికి వీడ్కోలు పలికారు. పిల్లలు, మహిళల నృత్యాలు, కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మార్కండేయ మందిరం వద్ద దేవీ మాత శోభాయాత్రలో ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, పద్మశాలి సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, వేదికపై అడిషనల్ కలెక్టర్ అంకిత్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్ తదితరులు

- ఎన్నికల సిబ్బందికి జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి దిశానిర్దేశం
- రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ తరగతులు

నిజామాబాద్అర్బన్: ఎన్నికల విధుల పట్ల పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, ఏజెంట్ల నియామకం, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లచే అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలన్నారు.

ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా ఎన్నికల విధులను పారదర్శకంగా నిర్వర్తించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీల పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటనను అనుసరిస్తూ ఆర్‌వోలు నోటిఫికేషన్ జారీ చేసి, ఆ రోజు నుండే ప్రాదేశిక నియోజకవర్గ స్థానాల ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు సంబంధించి నోటిఫికేషన్ లో స్పష్టంగా వివరాలను పొందుపర్చాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని, సమయ పాలనను పక్కాగా పాటించాలన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థి సహా ముగ్గురిని మాత్రమే లోనికి అనుమతించాలన్నారు. నామినేషన్ల ఉపసంహరణ కోసం అభ్యర్థులు కాకుండా, వారి తరఫున ప్రతిపాదకులు వచ్చిన సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే ఉపసంహరణకు అనుమతించాలని కలెక్టర్ సూచించారు. బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్లను తెలుగు అక్షర క్రమం ఆధారంగా వరుసగా ముద్రించాల్సి ఉంటుందని అన్నారు.. అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామినేషన్ల దరఖాస్తులను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి, ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి, అందుకు గల కారణాలు ఏమిటీ అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు నామినేషన్లు సరైన పద్ధతిలో సమర్పించేలా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌వో, ఏఆర్‌వోల సందేహాలను నివత్తి చేసేందుకు వీలుగా జెడ్పీ సీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సంబంధిత వెబ్ సైట్లో అభ్యర్థుల నామినేష న్ పత్రాలను స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ అంకిత్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డిప్యూటీ సీఈవో సాయన్న, డీఈవో అశోక్, హౌసింగ్ పీడీ పవన్ కుమార్ పాల్గొన్నారు.

హైవే పైనా ఆరబోత

- పంట దిగుబడులను పోస్తున్న రైతులు
- కల్లాలు లేకపోవడంతో తప్పని పరిస్థితి

బాల్కొండ: ఆరుగాలం శ్రమించి పండించిన పంటల దిగుబడులకు అకాల వర్షాలు వెంటాడుతుండటంతో అన్నదాతలు హైవే పై కూడ ఆరబెడుతున్నారు. బాల్కొండ మండలం శ్రీరాంపూర్ నుంచి మెండోరా మండలం దూదిగాం వరకు గల జాతీయ రహదారి 44 పై రైతులు మక్కలను ఆరబెట్టారు. దీంతో ఎవుసం హైవే ఎక్కుతుందని అన్నదాతలే ఆవేదన చెందుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతులకు సీసీ కల్లాలను అందించడంలో వి ఫలం చెందుతున్నాయి. దీంతో రైతులు తారు రోడ్లనే కల్లాలు చేసుకుని మక్కలను ఆరబెడుతున్నా రు. గత కొంత కాలంగా వర్షాలు నిరంతరం కురవడంతో అన్నదాతలు పండించిన పంట నీటి పాలైంది. ప్రస్తుతం తుపాన్ హెచ్చరిక ఉండటంతో అన్నదాతల గుండెల్లో రైళ్లు పరు గెడుతున్నాయి. దీంతో అధికంగా మక్కలను నూర్పిళ్లు చేసి రోడ్లపై ఆరబెట్టారు. జాతీయ రహదారి పై వాహనాలు అతివేగంగా వెళ్తాయి. అలాంటి సందర్భంలో రైతులు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉంది.

ప్రభుత్వాలు సబ్సిడీపై సిమెంట్ కల్లాలను మంజూరు చేస్తే ఇలాంటి పరిస్థితి ఉండదని రైతులు అంటున్నారు. ఉపాధి హామీ పథకంలో గతంలో సిమెంట్ కల్లాలను మంజూరు చేశారు. అయితే నిబంధనల ప్రకారం కొలతలు చిన్నగా ఉండటంతో రైతులు ఆసక్తి చూపలేదు. రైతులకు అనుగుణంగా కొలతలు ఉంటే ఆసక్తి చూపేవారమంటున్నారు. ప్రభుత్వం స్పందించి సిమెంట్ కల్లాలను నిర్మించాలని రైతులు కోరుతున్నారు. తారు రోడ్లపై మక్కల సీజన్ నుంచి యాసంగిలో వరి ధాన్యం పంట దిగుబడులు ఆరబెట్టే వరకు అంటే మే నెల వరకు తారు రోడ్లు పంట దిగుబడులతో నిండిపోతుంటాయి. ప్రభుత్వాలు చర్యలు తీసుకుని వెంటనే సిమెంట్ కల్లాలు మంజూరు చేయాలని రైతు లు వేడుకుంటున్నారు.



బాల్కొండ మండలం శ్రీరాంపూర్ శివారులో జాతీయ రహదారి 44 పై ఆరబోసిన మక్కలు

కల్లాలులేకనే రోడ్లపై ఆరబెడుతున్నాం

అనుకూలంగా కల్లాలు లేక పోవడం వలనే హైవే రోడ్డుపై పంట దిగుబడులను ఆరబెడుతున్నాం. వాతావరణం కూడ రైతులను సతాయిస్తుంది. ప్రభుత్వాలు స్పందించి సిమెంట్ కళ్లాల మంజూరు చేయాలి. - శ్రీనివాస్, రైతు, శ్రీరాంపూర్

యోగాసనం.. అల్లాహ్ ఉచ్చారణ

- ప్రత్యేకత చూపుతున్న అర్సపల్లి 'మైనారిటీ యోగా కేంద్రం'
- 25 ఏళ్లుగా సాగుతున్న శిక్షణ
- మొదట వ్యతిరేకత..తర్వాత అవగాహనతో ముందుకు సాగుతూ..
- ఆరోగ్యమే మహాభాగ్యం.. యోగాతో మేలంటున్న ముస్లింలు

సండే స్పెషల్





సుప్త వజ్రాసనం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: యోగా చేయడాన్ని మొదట వ్యతిరేకించినవారే, ఇప్పుడు అవగాహనతో చేస్తున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. నిజామాబాద్ నగరంలోని అర్సపల్లిలో 2000 సంవత్సరంలో 'యోగా రత్న' ఎక్కొండ ప్రభాకర్ ఆధ్వర్యంలో మొదలైన 'మైనారిటీ యోగా కేంద్రం' ప్రత్యేకంగా నిలుస్తోంది. 25 సంవత్సరాల కిత్రం అర్సపల్లి ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఈ మైనారిటీ యోగా కేంద్రాన్ని మొదలుపెట్టారు. ప్రస్తుతం దీన్ని నాలెడ్జ్ పార్క్ స్కూల్‌లో నిర్వహిస్తున్నా రు. ప్రతిరోజూ యోగా చేస్తుండడంతో తామంతా అనేక దీర్ఘకాలిక వ్యాధుల నుంచి చాలావరకు స్వాంతన పొందుతున్నట్లు సీనియర్ సిటిజన్స్ చెబుతున్నారు. మొదట్లో ముస్లిం మైనారిటీ సమాజంలోని కొందరి నుంచి వ్యతిరేకత వచ్చినప్పటికీ తర్వాత అవగాహన వచ్చి కేంద్రాన్ని విజయవంతంగా నడుపుతున్నారు. అయితే యోగాసనాలు వేసే సమయంలో ఓంకారానికి బదులు అల్లాహ్ అని ఉచ్చారణ చేస్తున్నారు. ఇక్కడ విశేషమేమిటంటే ఈ కేంద్రంలో యోగా చేస్తున్నవారిలో రామాయణం, మహాభారతం, భాగవతం, భగవద్గీత తదితర పురాణాల గురించి అనర్గళంగా చెప్పేవారుండడం.



యోగాసనాలు వేస్తున్న ముస్లింలు

వ్యాధులు నయమవుతున్నాయి..



ప్రభాకర్ గురూజీ ఆధ్వర్యంలో 25 ఏళ్ల కిత్రం మొదలు పెట్టాం. నిర్విరామంగా నిర్వహిస్తున్నాం. యోగా చేయడంతో సగానికి పైగా వ్యాధులు నయమవుతున్నాయి. మొదట్లో ముస్లింలు యోగా చేయవద్దు అంటూ వ్యతిరేకత వచ్చింది. అయితే వ్యతిరేకించినవారి వద్ద యోగా చేసి చూపించాం. అర్థం చేసుకున్నారు. ఇప్పుడు వారు కూడా యోగాకు వస్తున్నారు. నెలలో 20 రోజులు చేస్తున్నాం. - షహీద్‌ఖాన్

ఇప్పటివరకు 24 యోగా కేంద్రాలు..



ఖర్చు లేకుండా ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో యోగా కేంద్రాలు పెంచుకుంటూ వస్తున్నాం. ప్రస్తుతం 24 యోగా కేంద్రాలు నిర్వహిస్తున్నాం. యోగాతో అనేక వ్యాధులకు పరిష్కారం లభిస్తుంది. దీంతో పాటు ఆయుర్వేదం వాడితే ఎన్నో వ్యాధులు నయమవుతాయి. తుది శ్వాస వరకు యోగా, ఆయుర్వేదం ద్వారా సేవ చేసేందుకు నిర్ణయించుకున్నా. మైనారిటీ యోగా కేంద్రం నాకు అత్యంత ప్రత్యేకం. వీళ్లంతా నున్ను గురువుగా భావించి యోగా చేస్తున్నారు. దీంతో మరింతమంది నేర్చుకునేందుకు వస్తున్నారు.
- ఎక్కొండ ప్రభాకర్, శిక్షకులు, యోగా రత్న అవార్డు గ్రహీత

దేశంలోనే మొదటిది..



తెలంగాణలోనే కాదు దేశంలోనే ఇది మొదటి ముస్లిం మైనారిటీ యోగా కేంద్రం. ప్రభాకర్ గురూజీ ఈ కేంద్రాన్ని ప్రత్యేకమైన శ్రద్ధతో నిర్వహిస్తూ వస్తున్నారు. విజయవంతంగా 25 ఏళ్ల పూర్తి చేసుకుని మరింత ఉత్సాహంతో ముందుకు వెళుతున్నాం. ఇక్కడ యోగా చేస్తున్నవారందరూ ఆనందంగా ఉంటున్నారు. యోగాతో మంచి ఆరోగ్యం సిద్ధిస్తుంది. ప్రతిఒక్కరూ యోగా చేస్తే మంచి ఫలితాలుంటాయి. దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయి.
- సయ్యద్ ముజీబ్ అలీ, నాలెడ్జ్ పార్క్ స్కూల్ కరస్పాండెంట్



యోగా గురువు ప్రభాకర్‌తో శిష్య బృందం

ప్రభాకర్ గురూజీ ఒక ఎన్‌సైక్లోపీడియా..



ప్రేమ, సామరస్యంతో ప్రభాకర్ గురూజీ చెబుతున్న యోగా తరగతి అత్యంత ప్రత్యేకం. దీంతో యోగాపై మరింత ప్రేమ కలిగింది. ప్రతిరోజూ యోగా చేస్తుండడంతో చక్కటి ఆరోగ్యం కలుగుతోంది. 25 ఏళ్ల కిత్రం ఈ కేంద్రం ప్రారంభించే విషయంలో షహీద్‌ఖాన్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. యోగా గురూజీ ప్రభాకర్ యోగాతో పాటు ఆయుర్వేదం, వనమూలికల వైద్యం చేస్తున్నారు. ప్రభాకర్ గురూజీ అంటేనే ఒక ఎన్‌సైక్లోపీడియా.
- ఆబిద్ అలీ, రిటైర్డ్ ప్రిన్సిపల్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ట్రెక్కింగ్ శిక్షణ పూర్తి



డిచ్‌పల్లి: మండలంలోని రాంపూర్ ఉన్నత పాఠశాల 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు బి అభినయ్, ఎం అక్షయ్ (ఎన్‌సీసీ కేడెట్లు) రాష్ట్రస్థాయి ట్రెక్కింగ్ శిబిరంలో శిక్షణ తరగతులను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఎన్‌సీసీ అధికారి, సెకండ్ ఆఫీసర్ శ్రీనివాస్ ఖత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 2 వరకు శిక్షణ శిబిరం కొనసాగిందన్నారు. శిక్షణ పూర్తి చేసుకుని పాఠశాలకు వచ్చిన విద్యార్థులను ఇన్‌చార్జి హెచ్‌ఎం మాధవ్ సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు.

ఎస్సారెస్పీకి తగ్గిన వరద



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టింది. శనివారం ఉదయం నుంచి క్రమంగా తగ్గుతూ సాయంత్రానికి 60 వేల క్యూసెక్కులకు పడిపోయింది. దీంతో వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు తగ్గించారు. 9 వరద గేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుంది. కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 200 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుంది. తాగు నీటి అవసరాల కు మిషన్‌భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 691 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుతం 1090.90 (80 టీఎంసీలు) అడుగుల నీటిమట్టం ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

గోదావరి నుంచి ఇసుక తరలింపు



బాల్కొండ: ఇంటి నిర్మాణాల కోసం ఇసుక తిప్పలు ఎక్కువయ్యాయి. దీంతో వాగులు, వంకలు కాకుండ ఏకంగా గోదావరి నుంచే ఇసుకను తరలిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వరద గేట్ల ముందర గోదావరి నుంచి ఇసుకను తీస్తు కుప్పలు వేస్తున్నారు. అనంతరం కుప్పలను తరలిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు అధికంగా కురవడంతో వాగుల నుంచి ఇసుకను తీసే అవకాశం లేదు. అంతేకాకుండ ఇసుక తరలింపునకు అనేక అనుమతుల అవసరం ఉండటంతో కనీసం ఇందిరమ్మ లబ్ధిదారులకు కూడ ఇసుక లభించడం లేదు. దీంతో కొందరు వ్యాపారులు గోదావరి నుంచి ఇసుకను తీస్తూ, వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోదావరిలో ఇసుక తరలింపు పక్కదారి పట్టకుండ చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



ఎడపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు



మోర్తాడ్‌లో బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకువెళుతున్న మహిళలు

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



ఆలూర్‌లో బతుకమ్మలతో మహిళలు



ముప్కాల్ మండల కేంద్రంలో..



ఎడపల్లిలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో దసరా మరుసటి రోజు సద్దుల బతుకమ్మ నిర్వహించడం ఆనవాయితీ. కానీ ఈసారి దసరా మరుసటి రోజు శుక్రవారం రావడంతో సద్దుల బతుకమ్మ వేడుకలను శనివారం జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు, యువతులు ఉదయం రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం గ్రామ కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతం మహిళలు, యువతులు, చిన్నారులు వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యం చేస్తూ సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను ప్రజలందరూ ఊరేగింపుగా తీసుకెళ్లి, స్థానిక చెరువులు, కుంటల్లో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ముప్కాల్ మండల కేంద్రంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో అరుణోదయ విమలక్క పాల్గొన్నారు. తెలంగాణలో బతుకమ్మ పండుగ అంటే ఆడ పడుచుల పండుగ అని ఆమె పేర్కొన్నారు.



బాల్కొండ మండలం వన్నెల్(బి)లో బతుకమ్మకు పూజలు చేస్తున్న చిన్నారి



పడగల్ గ్రామంలో..



దోన్‌పాల్‌లో రంగు కాగితాలతో తయారు చేసిన బతుకమ్మ





గాండ్లపేట్‌లో బతుకమ్మతో చిన్నారులు.. కమ్మర్‌పల్లిలో దంపతులు

వైద్య సేవలు, టీకాలు సకాలంలో అందించాలి





సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ.. పాల్గొన్న వైద్యశాఖ అధికారులు, సిబ్బంది

- డీఎంహెచ్‌వో రాజశ్రీ
- నగరంలో ప్రజారోగ్య సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష

నిజామాబాద్ నాగారాం: ప్రజలకు సకాలంలో వైద్య సేవలు, వ్యాధి నిరోధక టీకాలు అందించాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. నగరంలో శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో వివిధ ప్రజారోగ్య సంక్షేమ కార్యక్రమాలపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. మాతా, శిశు ఆరోగ్య సేవలు, వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందించడం. సీజనల్ వ్యాధులు, కీటకజనిత వ్యాధులను వ్యాప్తి చెందకుండా నియంత్రించడం. డెంగీ పాజిటివ్ గుర్తించబడిన ప్రాంతాలలో దోమల నివారణ చర్యలు సహా పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా ప్రతి టీం సంవత్సరంలో రెండు సార్లు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో, ప్రతి పాఠశాలలో విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానాలను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టీబి ముక్త భారత్‌లో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న శిబిరాలను విజయవంతం చేసేలా ప్రతి ఒక్క సిబ్బంది పాల్గొనాలన్నారు. ప్రయివేట్ ఆస్పత్రులన్నీ అన్ని అనుమతులు పొందిన తర్వాతనే వైద్య సేవలు అందించాలన్నారు. స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డీటీసీవో దేవీ నాగేశ్వరి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు రమేష్, సమత, అశోక్, తుకారాం రాథోడ్, రాజు, శ్వేత, భార్గవి, వెంకటేష్, శిఖర తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- నగరంలోని దుబ్బ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన



దుబ్బలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో శనివారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పునాది దశ వరకు నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న లబ్ధిదారులను కలిసి, వారికి మొదటి విడత బిల్లు మంజూరు అయ్యిందా అని ఆరా తీశారు. పనులు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి, కారణాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక, మంజూరు ప్రక్రియలలో జాప్యానికి తావు లేకుండా చూడాలన్నారు. ఆర్థిక స్తోమత లేని లబ్ధిదారులకు మెప్మా ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ కింద రుణం అందించేలా చొరవ చూపాలని అన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ఏమైన ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించుకుంటూ ముందుకెళ్లాలని, నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణాలు జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తాను తదుపరి తనిఖీలు జరిపే సమయానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి కనిపించేలా అంకిత భావంతో కృషి చేయాలన్నారు. అనంతరం దుబ్బ ప్రాంతంలోని అభయహస్తం కాలనీని కలెక్టర్ సందర్శించారు. ప్రభుత్వ అసైన్డ్ భూమిని పరిశీలించి, హద్దులను నిర్ధారించాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, హౌసింగ్ పీడీ పవన్ కుమార్, డీఈ నివర్తి, మున్సిపల్ టౌన్ ప్రాజెక్టు అధికారి రమేష్, నార్త్ తహసీల్దార్ విజయ్ కాంత్ ఉన్నారు.

మహిళలకు అండగా, అందుబాటులో షీటీమ్

- నవరాత్రి ఉత్సవాల్లో 19 ఈవ్‌టీజింగ్ కేసులు నమోదు
- సీపీ పోతరాజు సాయిచైతన్య



సీపీ పోతరాజు సాయిచైతన్య

ఖలీల్‌వాడి: మహిళలు, బాలికలకు అండగా నిజామాబాద్ షీటీమ్ 24 గంటలు అందుబాటులో ఉంటూ సేవలందిస్తుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య శనివారం తెలిపారు. దుర్గా నవరాత్రి ఉత్సవాలలో రాత్రి సమయాల్లో మహిళలను ఆకతాయిలు వేధించగా 19 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. గత నెలలో జిల్లా వ్యాప్తంగా షీటీం బృందాలు యువతులకు, విద్యార్థులకు, పని స్థలాలలో మహిళలకు ప్రత్యేకంగా 26 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, చైతన్యపరిచినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ నెలలో షీటీం బృందాల ద్వారా 11 ఈ-పెట్టీ కేసులు నమోదు చేశామని తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 80 హాట్ స్పాట్‌లను తనిఖీ చేశామని, పలు గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. ఏడుగురికి కౌన్సెలింగ్ ద్వారా కేసులలో పరిష్కారం చూపబడిందన్నారు. ఎవరైనా షీటీమ్ బృందాలను సంప్రదించాలంటే 87126 59795ను సంప్రదించాలన్నారు.

ఆపన్న హస్తం అందించరూ!

- ఆర్మూర్‌కు చెందిన శాంతిలాల్‌కు ఫెయిలైన కిడ్నీలు
- వైద్యం కోసం రూ.లక్షల్లో ఖర్చు
- దాతలు ఆదుకోవాలంటూ కుటుంబీకుల వేడుకోలు



ఆదుకోవాలని వేడుకుంటున్న కళ్యాణి, భర్త శాంతిలాల్

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌కు చెందిన కల్యాణి పట్టణంలోని హెడ్ పోస్ట్‌ఆఫీస్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తుంది. ఆమె భర్త దేదావత్ శాంతిలాల్ రెండు కిడ్నీలు చెడిపోవడంతో గత రెండేళ్లుగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. వైద్యానికి ఇంకా రూ.లక్షల్లో అవసరం ఉండగా పేదరికం కారణంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఒకరోజు విడిచి మరోజు డయాలసిస్ చేసుకుంటున్నాడు. ప్రస్తుతం ఏ పని చేయలేపోతున్నారు. కాగ కల్యాణి చిన్న కాంట్రాక్టు ఉద్యోగం చేస్తూ వచ్చిన జీతంతో కుటుంబాన్ని పోషిస్తుంది. భర్త వైద్యం కోసం చేసిన అప్పులు పేరుకు పోయాయి. కుటుంబానికి ఎలాంటి ఆసరా లేకపోవడం, పేదరికం కారణంగా అప్పులు తీర్చలేక, భర్తకు మెరుగైన వైద్యం అందించలేకపోతుంది. ఎవరైన దాతలు ముందుకువచ్చి తన భర్తను కాపాడాలని వేడుకుంటున్నారు. ఆర్థిక సహాయం అందించాలనుకునే వారు ఫోన్‌పే నంబర్: 9121744642కు చేయాలని కోరుతున్నారు.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

నిజామాబాద్ రూరల్: ఎన్నికల విధులపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సూచించారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో శనివారం రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అధికారులకు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, ఏజెంట్ల నియామకం, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవోలు, ఆర్‌వోలు, ఏఆర్‌వోలు పాల్గొన్నారు.

బాత్‌రూమ్‌లో జారిపడి మహిళా కండక్టర్ మృతి



సాయవ్వ (ఫైల్)

బాన్సువాడ: ప్రమాదవశాత్తు బాత్‌రూమ్‌లో జారిపడి మహిళ కండక్టర్ మృతిచెందినట్లు సీఐ అశోక్ తెలిపారు. వివరాలు ఇలా.. పిట్లం మండలం కారేగాంకు చెందిన బేగరి సాయవ్వ(49) ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఆమె భర్త కొన్నేళ్ల క్రితమే మృతిచెందగా, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు పెళ్లిళ్ల అయిపోగా, కుమారుడితో కలిసి కొన్ని నెలలుగా బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో నివాసముంటుంది. శుక్రవారం రాత్రి బాత్‌రూమ్‌కు వెళ్లిన సాయవ్వ ప్రమాదవశాత్తు జారిపడిపోయింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు బేగరి సాయిచరణ్‌తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

క్రైం కార్నర్

చెరువులో పడి ఒకరు..



భూపాల్ (ఫైల్)

రాజంపేట: చెరువులో ప్రమాదవశాత్తు నీటమునిగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన రాజంపేట మండలం పొందూర్తి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై రాజు, కుటంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. పొందూర్తి గ్రామానికి చెందిన తుడం భూపాల్ (38)కు వివాహం జరుగగా, కొన్నేళ్ల క్రితమే భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. పిల్లలు లేరు. దీంతో భూపాల్ మద్యానికి బానిసయ్యాడు. అప్పుడప్పుడు జంగంపల్లి చెరువులో చేపలు పడుతూ తిరిగేవాడు. తరచూ ఇంట్లో చెప్పకుండ వెళ్లిపోయి రెండు, మూడు రోజుల వరకుతిరిగివచ్చేవాడు కాదు. ఈక్రమంలో సెప్టెంబర్ 30న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. శనివారం ఉదయం జంగంపల్లి చెరువులో ఓ వ్యక్తి మృతదేహం కనిపించగా, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివ రాలు సేకరించారు. మృతుడిని భూపాల్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. భూపాల్ కాళ్లకు వల చుట్టుకొని ఉండటంతో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి వల చుట్టు కోవడంతో మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి..



భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై అంజనేయులు శనివారం తెలిపారు. బస్వాపూర్‌లోని హైవేపై ఉన్న జైకా హోటల్ దగ్గర గుర్తుతెలియని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు.

పెద్దవాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారం ప్రాజెక్టు దిగువనున్న పెద్దవాగులో రెండు రోజుల క్రితం గల్లంతయిన వ్యక్తి మృత దేహం శనివారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. రాజంపేట మండలంలోని సిద్ధాపూర్ గ్రామానికి చెందిన పడింటి శేఖర్ (32) ఈనెల 2న సాయంత్రం చేపలు పట్టేందుకు పోచారం పెద్దవాగు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. నాగిరెడ్డిపేట ఎస్సై భార్గవ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది పోచారం పెద్దవాగులో రెండు రోజుల పాటు గాలించి శేఖర్ మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వరద కాలువలో గుర్తుతెలియని వ్యక్తి..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే వరద కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. బాల్కొండ ఎస్సై శైలెంధర్ తెలిపిన వివరాలు ఇలా.. బాల్కొండ మండలం వన్నెల్(బి) శివారులోని వరద కాలువలో శనివారం వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేవని, అతడి వయస్సు సుమారు 30–40 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. అతడే తెల్లషర్టు, నల్లప్యాంటు ధరించి ఉన్నాడని, కుడి చేతికి నల్ల దారం కట్టింది ఉందన్నాడు. మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు.

మెజార్టీ స్థానాలు గెలుపొందాలి

- ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి

డిచ్‌పల్లి: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలను బీజేపీ అభ్యర్థులు గెలుచుకునేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి పిలుపునిచ్చారు. శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎస్‌ఎల్‌జీ గార్డెన్స్‌లో బీజేపీ మండల కమిటీ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలాగా అంకితభావంతో పని చేయాలన్నారు. వార్డులు, గ్రామాలు, మండలంలో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ పార్టీని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని దినేష్ పటేల్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగుల లక్ష్మీనారాయణ, పార్లమెంట్ కన్వీనర్, మాజీ ఎంపీపీ గద్దె భూమన్న, పార్టీ మండల అధ్యక్షుడు కర్ని చంద్రకాంత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరమణ, శ్యాంరావు, సతీష్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, చౌకి లక్ష్మణ్, విఠల్, సురేష్, విష్ణు, నారాయణరెడ్డి, గాండ్ల లక్ష్మీనారాయణ, పరుశురాం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీపై కాషాయ జెండా ఎగురవేయబోతున్నాం ..

నిజామాబాద్ రూరల్: జిల్లా పరిషత్‌పై కాషాయ జెండా ఎగురవేయబోతున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ధీమా వ్యక్తం చేశారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో రూరల్ మండల కార్యకర్తల సమావేశంతోపాటు మోపాల్ మండల కార్యకర్తల సమావేశం నర్సింగ్‌పల్లి గ్రామ శివారు ఎస్‌ఆర్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, విజయానికి కృషి చేయాల్సిన విధానాలపై ఆయన కార్యకర్తలకు మార్గ నిర్దేశం చేశారు. సమావేశంలో పద్మరెడ్డి,జగన్ రెడ్డి, చింత శ్రీనివాస్ రెడ్డి, రవి,గోపి,బిలోజి నాయక్, ఆనంద్, సందీప్, మోపాల్ మండల ఇంచార్జి ప్రమోద్ కుమార్ మండలపార్టీ అధ్యక్షుడు శశాంక్ రెడ్డి, సీనియర్ నాయకులు రవి,బోడ మహెందర్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో యువకుడి ఆత్మహత్య

నవీపేట: మండల కేంద్రంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. వివరాలు ఇలా.. మండల కేంద్రంలోని తడగామ కాలనీకి చెందిన సిరిసాగర్ రాజయ్య(38) గత కొంతకాలంలో అప్పులతో తీవ్రంగా బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య అనిత, కూతురు, కుమారుడు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నస్రుల్లాబాద్: మండలంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. వర్ని మండలం పొట్టిగుట్ట తండాకు చెందిన హీర్యా ఈ నెల 2న రాత్రి బాన్సువాడ మండలం పోచారం గ్రామానికి వెళ్లి వస్తున్నాడు. ఈక్రమంలో మండలంలోని బొమ్మన్ దేవ్‌పల్లి క్రాస్ రోడ్డు హైవేపై గుర్తుతెలియని వాహనం అతడికి ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుమారుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

డీజే నిర్వాహకులపై కేసు నమోదు

బాన్సువాడ: దుర్గామాత నిమజ్జనం సందర్భంగా అనుమతులు తీసుకోకుండా డీజే సౌండ్‌సిస్టం పెట్టి ప్రజలకు ఇబ్బందులు కల్గించిన నిర్వాహకులు సాయిప్రసాద్, సల్మాన్‌లపై కేసు నమోదు చేసి, వాహనాలను జప్తు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. వారిని తహసీల్దార్ వరప్రసాద్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా డీజే పెడితే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

అటవీ అధికారులపై దాడి చేసిన నిందితుల అరెస్ట్

డిచ్‌పల్లి: అటవీశాఖ అధికారులపై దాడి చేసిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై మహమ్మద్ షరీఫ్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని కొరట్‌పల్లితండా శివారులో అటవీ భూమి ఆక్రమణకు గురికాకుండా ఈ నెల 3న బీట్ అధికారి సంగం సతీష్, స్ట్రైకింగ్ ఫోర్స్ వాచర్ హరీష్‌లు పొక్లెయిన్‌తో కందకాల తవ్వకాలు చేపట్టారు. ఈక్రమంలో తండాకు చెందిన ఆలకుంట రాజేందర్, పల్లపు గంగాధర్ అలియాస్ గంగారెడ్డి, కొమిరి రాజ్‌కుమార్ అలియాస్ రాజు అటవీ శాఖ అధికారులపై కర్రలు, రాళ్లతో దాడి చేసి చంపుతామని బెదిరించారు. ఈమేరకు అటవీశాఖ అధికారి సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకొని శనివారం కోర్టులో హాజరు పరుచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.